క్లుప్తంగా

నేడు 'క్రెడాయి' ఎన్నికలు

నయీంనగర్: క్రెడాయి (కన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఎన్నికలు హనుమకొండ కేయూ క్రాస్‌లోని క్రెడాయి కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం జరగనున్నాయని బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనంతరం ఫలితాలు, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం, జనరల్ బాడీ మీటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులుగా చాడ పురుషోత్తంరెడ్డి, గట్టు మహేష్‌బాబు, వీటీ.ప్రసాద్, జగన్‌మోహన్ వ్యవహరిస్తారని తెలిపారు.

నిరుద్యోగులకు స్వయం ఉపాధి



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

కాజీపేట: ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో దళితబంధు పథకం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ ప్రధాన రహదారిపై దళితబంధు వార్షికోత్సవాన్ని శనివారం ప్రారంభించి లబ్ధిదారుడు గబ్బెట శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, నార్లగిరి రమేష్, శిరుమల్ల దశరథం, ఎండీ.అఫ్జల్, మర్యాల కృష్ణ, సిరిల్ లారెన్స్, పాస్టర్ మంద కుమార్, తండమళ్ల వేణు, బొల్లె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ విజయలక్ష్మికి సన్మానం

హన్మకొండ: బీజేపీ నాయకురాలు డాక్టర్ టి.విజయలక్ష్మిని జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ నిర్మల్‌సింగ్ సన్మానించారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో సీనియర్ కార్యకర్తలకు సన్మాన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మిని ఆయన అభినందించారు.

వీడియో జర్నలిస్ట్‌పై దాడి హేయం

నయీంనగర్: వీడియో జర్నలిస్ట్‌పై దాడి హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన రిజర్వ్‌డ్ ఎస్సై భానుప్రకాష్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కవరేజ్‌లో ఉన్న ఓ టీవీ వీడియో జర్నలిస్టుపై అకారణంగా ఎస్సై భానుప్రకాష్ దాడి చేశారని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, కార్యవర్గ సభ్యులు తెలిపారు. విధుల్లో ఉన్న వీడియో జర్నలిస్టుపై అకారణంగా దాడి చేసి కెమెరా, లైవ్ కిట్ లాక్కొని గొంతు పట్టుకొని నెట్టేసిన ఎస్సైపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'హాకీ' ఎన్నికలు సరికావు

నయీంనగర్: హనుమకొండ జిల్లా హాకీ అసోసియేషన్ ఎన్నికలు సరికావని నయీంనగర్ హాకీ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు ఆరోపించారు. నయీంనగర్ హాకీ క్లబ్ క్రీడాకారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అసోసియేషన్ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఎన్నికలు నియమావళికి విరుద్ధంగా జరిగిన ఎన్నికలను రద్దు చేసి మరలా నిర్వహించాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ హైదరాబాద్ హాకీ అసోసియేషన్‌కు వారు విజ్ఞప్తి చేశారు.

రాతికోటపై దర్గా గద్దె నిర్మాణం



ఖిలా వరంగల్: చారిత్రక ఖిలా వరంగల్ తూర్పుకోటకు వెళ్లే దారిలోని రాతికోటపై దర్గా గద్దెను నిర్మించి జెండాలు ఏర్పాటు చేశారు. కేంద్ర పురావస్తుశాఖ అధికారులు నిఘా లోపం వల్లనే మత విద్వేషాలు రెచ్చగొట్టే నిర్మాణాలు కొనసాగుతున్నాయని చరిత్రకారులు, స్థానికులు వాపోతున్నారు.

స్థల సమస్య పరిష్కరించాలని వినతి

హన్మకొండ అర్బన్: కడిపికొండలో టీఎన్జీఓస్‌కు చెందిన హౌసింగ్ సొసైటీ స్థలం విషయంలో ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓస్ నాయకులు శనివారం నగర పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందించారు. స్వయంగా సీఎం ఆదేశాలతో టీఎన్జీఓస్‌కు కేటాయించిన స్థల వివాదం గురించి వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కేటీఆర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రికి వినతిపత్రం అందించిన వారిలో టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, టీజీఓస్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త అన్నమనేని జగన్మోహన్‌రావు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, నాయకులు పుల్లూరు వేణుగోపాల్, పనికెలరాజేశ్, శనిగరపు శ్యాంసుందర్ భరత్, ప్రణయ్, రజిత, అశోక్ ఉన్నారు.

అడ్డగోలుగా పార్కింగ్.. ఇదేమంటే గొడవ

- నిత్యం రద్దీగా సోమిడి రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



సోమిడికి వెళ్లే దారిలో ఓ వైన్ షాపు వద్ద రద్దీగా ఉన్న రోడ్డు

కాజీపేట: రోడ్డు పక్కన వాహనాలు నిలిపినా, హెల్మెట్ ధరించకపోయినా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారంటూ అధికారులు విచ్చలవిడిగా ఈ – చలాన్లు వేస్తుంటారు. ట్రాఫిక్ పోలీసులకు రాత్రి సమయాల్లో మద్యం దుకాణాల వద్ద ప్రధాన రహదారులపై అడ్డగోలుగా చేసే వాహనాల పార్కింగ్ మాత్రం కనిపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్రోలింగ్ కోసం పోలీసు వాహనాలు తిరుగుతున్నా ఫలితం శూన్యం. ఇది గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మద్యం దుకాణాల వద్ద నెలకొన్న దుస్థితి.

అధికారులూ స్పందించండి

కాజీపేట చౌరస్తా నుంచి సోమిడికి వెళ్లే రహదారిలో రెండు మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటికి పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో మద్యం కోసం వచ్చే వారు తమ వాహనాలను రహదారిపైనే ఇష్టం వచ్చినట్లుగా నిలుపుతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో ఈ రెండు దుకాణాల వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దారికి ఒకవైపు చిరు వ్యాపారుల హడావుడి, మరోవైపు మద్యం దుకాణాల ఎదుట బారులు తీరిన వాహనాలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వాటికి తోడు సెంట్రల్ లైటింగ్ కోసం రెండేళ్ల క్రితం తవ్విన గోతులు ఇబ్బందికరంగా మారాయి. ఈ మార్గం పలు గ్రామాలకు అనుసంధానంగా ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. మద్యం దుకాణాల ముందు రహదారికి అడ్డంగా వాహనాలు నిలపడం ఏమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై గొడవకు దిగుతున్నారు. మహిళల పట్ల మందుబాబులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మద్యం దుకాణాలకు ఎదురుగా ఉన్న వైఎస్సార్ కాలనీలో 8బెల్టు దుకాణాలు, 24గంటలు అనుబంధంగా నడుస్తుంటాయి. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

కేయూలో కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ అధ్యాకుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని, వారందరిని రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. ధర్నా కార్యక్రమంలో జేఏసీ బాధ్యులు జరుపుల చందులాల్, నాగయ్య, మధుకర్‌రావు, శ్రీధర్‌రావు, లక్ష్మారెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, మంజుల, కల్పన చీకటి శ్రీనివాస్, అనిల్‌కుమార్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని హనుమకొండలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, ఉమెన్స్ కన్వీనర్ మధుశ్రీ, తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు.

పసిబాలుడిపై వీధికుక్క దాడి



కాజీపేట అర్బన్: వరంగల్ నగరంలో శనివారం 18 నెలల బాలుడిపై ఓ వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే బాలుడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ నగర పర్యటన రోజే ఈ ఘటన చోటుచేసుకుంది. కాజీపేట రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో వీధికుక్కల దాడిలో బాలుడు మృతిచెందిన సంఘటన మరవకముందే ఈ ఘటన జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో నివాసం ఉంటున్న మున్సిపల్ వాటర్‌మన్ మథ్యాస్, కళ్యాణి దంపతుల చిన్న కుమారుడు డేవిడ్ రాజ్ (18నెలలు) ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. వీధికుక్కల గుంపు రాగా, అందులో ఓ కుక్క ఒక్కసారిగా బాలుడిపై విరుచుకుపడి ముఖభాగంపై కరిచింది. దీంతో కుడి దవడకు తీవ్రగాయమైంది. గమనించిన తల్లిదండ్రులు కుక్కను చెదరగొట్టారు. వెంటనే డేవిడ్‌రాజ్‌ను 108 వాహనంలో ఎంజీఎం తరలించారు. ఎంజీఎం వైద్యులు కుడి దవడ ఛిద్రం అవడంతో కుట్లు వేసి వారం రోజుల పాటు ఎంజీఎంలో చికిత్స పొందాలని తెలిపినట్లు డేవిడ్ రాజ్ తండ్రి మథ్యాస్ తెలిపాడు. పసిబాలుడిపై దాడి చేసిన కుక్కవెంట ఉన్న మిగతా కుక్కలు మరో ఇద్దరిపై దాడికి పాల్పడడంతో స్థానికులు గాయపరిచాయి. అందులో ఓ వీధికుక్కను కొట్టి చంపేశారు.

మున్సిపల్ శాఖ మంత్రి రాక రోజే ఘటన..

మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శనివారం నగరంలో పర్యటించారు. ఆ సమయంలోనే రాజీవ్‌గృహకల్ప సముదాయంలో వీధికుక్కలు దాడి చేయడం తీవ్ర కలకలం రేపింది. మంత్రి.. మున్సిపల్ సిబ్బంది పనితీరుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

డ్యూటీ టైం అయింది.. రేపొస్తాం!

బాలుడిపై కుక్కల దాడి నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది వాటిని పట్టుకోవడానికి వాహనంతో సహా వచ్చారు. 30 నుంచి 40 కుక్కలు రాజీవ్ గృహకల్పలో సంచరిస్తుండగా.. ఒక కుక్కను మాత్రమే సిబ్బంది పట్టుకున్నారు. 'మా డ్యూటీ టైం అయిపోయింది. రేపొచ్చి పట్టుకుపోతాం' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి వెళ్లిపోయారు. దీంతో స్థానికులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేయూలో పీహెచ్‌డీ సీట్ల సంఖ్య పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: కేయూలో పీహెచ్‌డీ సీట్ల సంఖ్య పెంచాలని కాకతీయ యూనివర్సిటీలోని పలు విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు మంత్రి కేటీఆర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరేళ్ల తరువాత కాకతీయ యూనివర్సిటీ ఇచ్చిన నోటిఫికేషన్‌లో పీహెచ్‌డీ సీట్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈక్రమంలో సీట్ల సంఖ్య పెంచేవిధంగా కేయూ వీసీ తాటికొండ రమేష్‌ను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో మంద భాస్కర్, నర్సింహారావు, మంద నరేష్, వడ్డెపెల్లి మధు, బొట్ల మనోహర్, బొట్ల తేజ, మంద శ్రీకాంత్, మచ్చ పవన్‌కళ్యాణ్, మధుగౌడ్, పవన్‌గౌడ్, ధరావత్ సుధాకర్, చుక్క ప్రశాంత్ ఉన్నారు.

రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు మంత్రి కేటీఆర్‌ను కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ కన్వీనర్ డాక్టర్ కరుణాకర్‌రావు, కన్వీనర్ డాక్టర్ సాధు రాజేష్, బాధ్యులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో డాక్టర్ బైరి నిరంజన్, డాక్టర్ ఫిరోజ్‌పాషా, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ చిర్ర రాజు ఉన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: జిల్లాలో గోవధ నిషేధానికి కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న గో వధశాలలను తక్షణం మూసివేయాలని భారతీయ గోవంశ రక్షణ సంవర్ధన పరిషత్, విశ్వహిందూ పరిషత్ గోరక్ష విభాగం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలెక్టరేట్‌లో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వీహెచ్‌పీ వరంగల్ మహానగర కార్యదర్శి శ్రీరాం ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణా విషయంలో ప్రభుత్వం, పోలీస్ శాఖలు కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ విషయమై పోలీస్ కమిషనర్ రంగనాథ్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు తాడిశెట్టి శ్రీధర్, జి.రాకేష్, ఆదిత్యసాయి, భజరంగ్‌దళ్ నాయకులు సుతారి సాయిరాం, తిరుపతిరెడ్డి, సాయినాథ్, హరీష్, అనుమాండ్ల శివకృష్ణ తదితరులు ఉన్నారు.

కుటుంబ పాలనను అంతమొందించాలి

ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న నిరంకుశ, కుటుంబ పాలనను ప్రజలు అంతమొందించాలని జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ నిర్మల్‌సింగ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ 9ఏళ్ల పాలన సందర్భంగా మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి కల్యాణ మండపంలో బీజేపీ తూర్పు కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన వివిధ మోర్చాల సమ్మేళనం సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం మోసగాళ్లు వస్తున్నారని, వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పార్టీకి పట్టుకొమ్మలాంటివి 7 మోర్చాలు ఉన్నాయని వివరించారు. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ అధికారంలోకి రావడానికి మోర్చాలే కారణమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు గంట రవికుమార్, రత్నం సతీష్‌షా, బాకం హరిశంకర్, కుమారస్వామి, కల్యాణి, బైరి శ్యామ్, శ్రీరామ్‌రెడ్డి, సామల నిరంజన్, వివిధ మోర్చాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



నియామక పత్రాలు అందజేస్తున్న తిరుమల్‌రావు

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధికి పెద్దపీట వేస్తోందని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు విభాగాలకు చెందిన 51మంది విద్యార్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. సోల్వ్ -క్యూలో 25మంది, టెక్నియాన్‌లో 16మంది, మోనోసేజ్‌లో 10మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. ఈమేరకు వారికి నియామక పత్రాలు అందించి అభినందించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుశాంత్ పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు 6స్థానాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశం

నయీంనగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్సీ ఉపకులాలకు ఆరు స్థానాలు కేటాయించాలని, దళితబంధు పథకంలో 40శాతం కేటాయించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 22లక్షల జనాభా కలిగి దళితుల్లో 34శాతం ఉన్న 57 ఎస్సీ ఉపకులాలు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా ఈనాటికి రాజకీయ అధికారం పొందలేదని వాపోయారు. ప్రభుత్వ పథకాల్లో ఎస్సీ ఉపకులాలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుచ్చన్న, లక్ష్మీనర్సయ్య, స్వామి, శరత్, చిందు, చిరంజీవి, చందు తదితరులు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుల గడువు పొడిగించాలి

వరంగల్: బీసీ రుణాల దరఖాస్తుల గడువును జూలై 20 వరకు పొడిగించాలని, బీసీలోని అన్ని కులాలకు ఈ పథకం వర్తింపజేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. బీసీ కులవృత్తిదారులు రూ.లక్ష ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వడం లేదని దాంతో బీసీలు ఆందోళనలకు గురవుతున్నారని వాపోయారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్ కార్యాలయాల చుట్టూ మండుటెండలో తిరుగుతూ పడుతున్న బాధలు వర్ణనాతీతమని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై తిరుమలగిరి మండల కార్యాలయంలో ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమన్నారు. బీసీలలోని కేవలం 15కులాలకు మాత్రమే రుణాలు ఇస్తామని ప్రకటించడం శోచనీయమని పేర్కొన్నారు.

పలువురు నాయకుల అరెస్ట్.. విడుదల




హౌస్ అరెస్టుతో ఇంట్లో ఉన్న నాయిని, కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

హన్మకొండ చౌరస్తా: మంత్రి కేటీఆర్ నగర పర్యటన సందర్భంగా పలు పార్టీలకు చెందిన పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి, అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. డీసీసీ హనుమకొండ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డిని పోలీసులు శనివారం హౌస్ అరెస్టు చేశారు. కార్యక్రమంలో నాయకులు సరళ, సతీష్, స్వప్న, రాహుల్, సంపత్, శివాజీ, మనోహర్, నాగరాజు, సతీష్, మహేందర్, సారంగం, సతీష్, గణేష్ పాల్గొన్నారు.

బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హౌస్ అరెస్ట్

కాశిబుగ్గ: ఓ సిటీలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావును మిల్స్‌కాలనీ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

ఖిలా వరంగల్: మంత్రి కేటీఆర్ వరంగల్ పర్యటనలో భాగంగా బీజేపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్టైన వారిలో మార్టిన్‌లూథర్, రంజిత్, మాదాసి రాజు, పుప్పాల రాజేందర్, సుంచు కేశవ్, మండల సురేష్, మోహనచారి, మండల భూపాల్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

రామన్నపేట: 11, 29తో పాటు పలు డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులను మట్టెవాడ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బలవంతంగా అరెస్టు చేయడాన్ని గమనిస్తే ప్రజాస్వామ్యం ఎటుపోతోందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. అరెస్టైన వారిలో ఓరుగంటి పూర్ణ, చిప్ప వెంకటేశ్వర్లు, దొంతుల రాజీవ్ తదితరులు ఉన్నారు.

అదుపులో సకల కళా సాంస్కృతిక కళాకారులు

హన్మకొండ కల్చరల్: మంత్రి కేటీఆర్ వరంగల్ పర్యటనలో భాగంగా సకల కళా సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, జైబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు జడల శివను పోలీసులు శనివారం అరెస్ట్ చేసి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

ఉద్యమానికి ఊపిరి పోసిన కొండా లక్ష్మణ్ బాపూజీ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

రామన్నపేట: ప్రత్యేక రాష్ట్ర సాధనలో పోరాటం చేసిన కేసీఆర్‌కు తోడుగా నిలిచి ఉద్యమానికి ఊపిరిపోసిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని మంత్రి కేటీఆర్ కొనియాడారు. కొత్తవాడలోని గోపాలస్వామి గుడి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001లో ఉద్యమం నడుస్తున్న సమయంలో జలదృశ్యం వద్ద తన ఇంటినే పార్టీ ఆఫీస్‌గా మార్చి ఉద్యమం కోసం పనిచేసిన గొప్ప మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని గుర్తుచేశారు. ఆయన జ్ఞాపకార్థం హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, కార్పొరేటర్ బస్వరాజు కుమార్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల భారీ ర్యాలీ



కేటీఆర్ సభకు తరలివెళ్తున్న నాయకులు

ఖిలా వరంగల్: వరంగల్ ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో నిర్మించనున్న కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభ వేదిక వద్దకు వరంగల్ రైల్వే గేట్ ప్రాంతం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు బైక్‌లపై ర్యాలీగా శనివారం తరలివెళ్లారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు ముష్కమల్ల సుధాకర్, బైరబోయిన దామోదర్ యాదవ్, బోగి సురేష్, బిల్లా శ్రీకాంత్, సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. డీసీపీ బారి ఆధ్వర్యంలో ఏసీపీ బోనాల కిషన్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళా ప్రదర్శన



విక్రయాలు చేస్తున్న మహిళలు, తదితరులు

హన్మకొండ అర్బన్: నిట్ సమీపంలోని తారా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన సందర్శకులను కట్టి పడేస్తోంది. సంప్రదాయ వస్త్రాలతో పాటు ఫ్యాషన్ ప్రపంచానికి తగిన రీతిలో వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో పేరెన్నికగల కళాకారులు తయారు చేసి ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. స్కిల్, కాటన్, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్పూర్, కాంతారా వర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ చీరలు మగువల మదిని దోచేస్తున్నాయి. వాటితోపాటు వన్‌గ్రాం గోల్డ్ ఆభరణాలు ఉన్నాయి. ప్రదర్శన వారంపాటు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రుద్రేశ్వరుడిని దర్శించుకున్న ప్రముఖులు



ఆశీర్వదిస్తున్న ఆలయ పూజారి ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని చారిత్రక ప్రసిద్ధిచెందిన రుద్రేశ్వరస్వామిని వరంగల్ జిల్లా కోర్టు 3వ సివిల్ లేబర్ కోర్టు న్యాయమూర్తి సత్యేంద్ర, రాష్ట్ర హైకోర్టు న్యాయవాది టీటీడీ మాజీ ఈఓ గోపాల్ కుమారుడు కశ్యప్, కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు తీర్చుకున్నారు. అంతకుముందు అతిథులను పూర్ణకుంభంతో ఆలయ ప్రధాన పూజారి గంగు ఉపేంద్రశర్మ, ఈఓ వెంకటయ్య, మణికంఠశర్మ స్వాగతించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు వితరణ చేసి ఆశీర్వచనం అందజేశారు.

విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీధర్

కాశిబుగ్గ: ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థినులకు బడిబాట కార్యక్రమంలో భాగంగా శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కెరీర్‌పై హెచ్‌ఎం కె.శ్రీధర్ అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏ కోర్సుతో ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో వివరించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఆపద సమయంలో 1098, 100, 102, 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సృజన, సీపీఓ సరిత, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.